తెలంగాణ గడ్డ నుంచే కాంగ్రెస్ 'జంగ్ సైరన్'

- 6న తుక్కుగూడలో భారీ బహిరంగ సభ
- దేశ ప్రజల కోసం అదే రోజు మ్యేనిఫెస్టో విడుదల
- హాజరుకానున్న ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిఎం రేవంత్‌రెడ్డి
- ఘనంగా ఏర్పాట్లు...భారీ ఎల్ఇడి స్క్రీన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డ మీద నుంచే కాంగ్రెస్ పార్టీ 'జంగ్ సైరన్' మోగించనుంది. అసెంబ్లీ ఎన్నికల సభలకు తొలిసారి వేదికైన తుక్కుగూడ నుంచే ఈ నెల 6న జనజాతర బహిరంగ సభకు నాంది పలకనుంది. ఇప్పటికే కొనసాగుతున్న కాంగ్రెస్ జైత్రయాత్రకు జనజాతర మరో మైలు రాయికానుంది. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు ఇచ్చే భరోసా (మ్యేనిఫెస్టో)ను ఈ వేదిక నుంచే విడుదల చేయనుంది. జనజాతర సభను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఈ సభకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇదే స్థలంలో హస్తం పార్టీ తొలి బహిరంగ సభను నిర్వహించింది. అప్పుడు తలెత్తిన ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆ సమయంలో శ్రీశైలం హైవేపై పది గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సభా ప్రాంగణంతోపాటు కొన్ని కిలోమీటర్లమేర భారీ ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్... పదేండ్ల ఎన్డీఏ నిరంకుశ, దుష్పరిపాలనకు చరమగీతం పాడాలనే కృతనిశ్చయంతో ఉన్నది. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన మ్యేనిఫెస్టోను శాసనసభ ఎన్నికలకు సమరశంఖం పూరించిన తుక్కుగూడ వేదికగానే విడుదల చేయాలని నిర్ణయించింది.



పది లక్షల జనసమీకరణ

తుక్కుగూడలోని 60 ఎకరాల విశాలమైన మైదానంలో జనజాతర బహిరంగ సభను కాంగ్రెస్ నిర్వహించనుంది. మైదానం పక్కనే వాహనాల పార్కింగ్‌కు సుమారు 300 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం వంద రోజుల్లోనే పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.పది లక్షలకు పెంచడం, 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీని విజయవంతంగా అమలు చేస్తున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. 30 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చింది. 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు బంధు నిధులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. ప్రతినెల మొదటి తారీఖు రోజే ఉద్యోగులకు జీతాలు, పింఛనర్లకు పింఛన్లు అందజేస్తోంది. సిఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు వాటి పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. ఫలితంగా రాష్ట్రంలోని మహిళలు, యువత, రైతులతోపాటు అన్ని వర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై సానుకూల స్పందన వెల్లువెత్తుతున్నది. ఈ నేపథ్యంలో జనజాతర సభకు ఆదిలాబాద్ మొదలు ఆలంపూర్ వరకు, జహీరాబాద్ నుంచి భద్రాచలం వరకు అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడానికి సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. కనీసం పది లక్షల మంది ఈసభకు హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తున్నది. ఈ నేపథ్యంలోనే సిఎం ఇప్పటికే తుక్కుగూడ జన జాతర సభ ప్రాంగణాన్నిసందర్శించి సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీ సంఖ్యలో ప్రజలు సభకు తరలివచ్చినా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఉండేలా ఆయన ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

తుక్కుగూడనే ఎందుకు...?

శాసనసభ ఎన్నికలకు కాంగ్రెస్... సిఎం రేవంత్ నేతృత్వంలో తుక్కుగూడ నుంచే సమరశంఖం పూరించింది. తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17న తుక్కుగూడలో విజయభేరి పేరిట భారీ బహిరంగ సభను కూడా నిర్వహించింది. వేదిక మీద నుంచే సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. ఆయా గ్యారంటీలు తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంతో కాంగ్రెస్ శాసనసభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. ఈ నేపథ్యంలో తమకు కలిసివచ్చిన తుక్కుగూడ నుంచే లోక్‌సభ ఎన్నికలకు సమరశంఖం పూరించాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించింది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ, ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో లక్షలాది ప్రజల సమక్షంలో తమ ప్రభుత్వం కొలువుదీరుతుందని రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. జూన్ 9న ఎర్రకోటపై జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శాసనసభ ఎన్నికలకు మాదిరిగానూ ఇప్పుడు ఆయన చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి.

మెదక్ సీటు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం

- ఇందిరా గాంధీ ప్రాతినిథ్యం వహించిన స్థానమిది
- సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ లోక్‌సభ నియోజక వర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మెదక్ లోక్‌సభ స్థానంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో సిఎం పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానం కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకమని పేర్కొన్నారు. మెదక్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, బిజెపి పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు కలిసికట్టుగా పనిచేయడం ద్వారా అభ్యర్థి విజయానికి కృషిచేయాలన్నారు. పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల అమలుతో ప్రజల్లో సానుభూతి పెరిగిందని, వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ బాధ్యులు ఎప్పటికప్పుడుచేసుకుంటూ ముందుకెళ్లాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో టిఎస్ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, పఠాన్ చెరు, నర్సాపూర్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గ బాధ్యులు కాటా శ్రీనివాస్ గౌడ్, రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ప్రవేశాలు చేపడితే కఠిన చర్యలు

- ప్రయివేటు, కార్పొరేట్ కాలేజీలు నిబంధనలు పాటించాల్సిందే
- కొనసాగుతున్న అనుబంధ గుర్తింపు ప్రక్రియ
- ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాలు అక్రమ పద్ధతుల్లో ప్రవేశాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు హెచ్చరించారు. నిబంధనలు పాటించాల్సిందేనని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేపడితే అవి చెల్లుబాటు కాబోవని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేటు జూనియర్ కాలేజీలు పిఆర్వోలను నియమించుకుని అడ్మిషన్లు చేపడుతున్నాయంటూ తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. కొన్ని కాలేజీల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం పరీక్షలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించి ఇంకా ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేయలేదని వివరించారు. ఇప్పుడే కాలేజీల్లో ప్రవేశాలు తీసుకోవద్దని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సూచించారు. ప్రవేశాల షెడ్యూల్ వచ్చాక నిర్ణయం తీసుకోవాలని కోరారు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదనీ, ఏ కాలేజీకి గుర్తింపు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఆ జాబితాను ్ంఎఐవ.ఎస్ర్ర.స్త్రీశ.అఅ లేదా ఖఘుస్ంఎఐవ.ఎస్ర్ర.స్త్రీశ.అఅ వెబ్‌సైట్లలో పొందుపరుస్తామని వివరించారు. గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అడ్మిషన్ల షెడ్యూల్ వచ్చాకే విద్యార్థులను చేర్చుకోవాలని ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలను కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిఐఇఒలు కఠినంగా వ్యవహరించి అలాంటి కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏనుగు దాడిలో మిర్చి రైతు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏనుగు దాడి చేయడంతో రైతు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం బూరెపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. మహారాష్ట్ర ప్రాణహిత నది సరిహద్దు నుంచి ఏనుగు బూరెపల్లి గ్రామ శివారులోకి ప్రవేశించింది. రైతు అల్లూరి శంకర్(45) మిర్చి తోటలో భార్యతో కలిసి పనిచేస్తున్న క్రమంలో ఏనుగు తోటలోకి వచ్చింది. దాన్ని చూసి శంకర్ భార్య అరుస్తూ, కేకలు వేస్తూ పరిగెత్తగా.. ఆయన తోటలోనే మిర్చి చెట్ల కింద కూర్చున్నాడు. ఏనుగు ఒకేసారి ఆయనపై దాడి చేసింది. దీంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. డిఎఫ్ఒ నీరజ్ కుమార్, కౌటాల సిఐ సాదిక్ పాషా ఆధ్వర్యంలో ఏనుగును తిరిగి మహారాష్ట్ర అడవికి మళ్లించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఏనుగు బూరెపల్లి నుంచి రవ్వెల్లి, గంగాపూర్ ప్రాణహిత చేవెళ్ల కెనాల్ వెంబడి వెళ్తూ కర్జల్లి, చింతలమానేపెల్లి గ్రామాల పొలాల్లోకి వచ్చినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా, తమకు సహకరించాలని అధికారులు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏనుగును మహారాష్ట్ర మళ్లించే ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు

తక్షణమే సహాయక చర్యలు చేపట్టండి...

- ఎస్‌బి ఆర్గానిక్స్ పరిశ్రమ ప్రమాదంపై సిఎం రేవంత్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ సమీపంలోని ఎస్‌బి ఆర్గానిక్స్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్షించారు. రియాక్టర్ పేలడంతో మంటలు చెలరేగినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తక్షణమే సహాయక చర్యలు వేగవంతం చేసి, మంటలను అదుపులోకి తీసుకురావాలని అగ్నిమాపక శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందజేయాలని సిఎం జిల్లా అధికారులకు సూచించారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.



'ఏజ్ ఆఫ్ ఏజెన్సీ' పుస్తకావిష్కరణ


ప్రజాశక్తి - హైదరాబాద్

దక్షిణ భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా మాజీ మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ కెరుషన్ గోవేందర్ రచించిన "ఏజ్ ఆఫ్ ఏజెన్సీ" పుస్తకాన్ని ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పుస్తకావిష్కరణలో టెక్ట్రియాడ్ ఇంక్‌లో ప్రెసిడెంట్ అండ్ సిఇఒ అయిన భరణి కుమార్ అరోల్, హెచ్‌సియు ప్రొఫెస్ అతుల్ నేగి, ఎపి మాజీ డిజిపి ఆర్‌పి ఠాకూర్ పాల్గొన్నారు. లోతైన నకిలీలు, ఎఐ రూపొందించిన నకిలీ వీడియోల ప్రభావం ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఎలా ఉంటుంది అనే మీడియా ప్రశ్నకు ప్రొఫెసర్ అతుల్ నేగి. సమాధానమిస్తూ.. 100 కోట్ల జనాభా ఓటు వేయబోతున్న ప్రజాస్వామ్య పండుగలో కృత్రిమ మేధ ప్రభావం ఉండే అవకాశం ఉందని అన్నారు. డీప్ ఫేక్ ఏమిటో గుర్తించే సాంకేతికతలు ఉన్నందున దీని గురించి అనవసరంగా చింతించాల్సిన అవసరం లేదన్నారు.

అతి చిన్న కోతతో ఊపిరితిత్తుల్లోని క్యాన్సర్ కణితి తొలగింపు

- మెడికవర్ కేన్సర్ ఇన్స్‌ట్యూట్‌లో చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్



ఖమ్మం జిల్లాకు చెందిన రావు ఊపిరితిత్తుల క్యాన్సర్ కణితితో తమ ఆసుపత్రిలో చేరారని మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఓ ప్రకటనలో తెలిపింది. సాధారణంగా ఇటువంటి రోగుల్లో చాలామంది పెద్ద కోతతో ఛాతి కుహరాన్ని తెరిచి ఊపిరితిత్తుల లోబ్, కణితి తీసేయడం జరుగుతుందని డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. కానీ.. తాము ఈ పేషెంట్‌లో అతి తక్కువ కోతతో (మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ ద్వారా)ఊపిరితిత్తులలో ఉన్న క్యేన్సర్ కణితిని తొలగించి రోగి ప్రాణాలను కాపాడామని పేర్కొన్నారు. వయసురీత్యా అతనికి ఇటువంటి సర్జరీ అతనికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

రాఘవేంద్రరావుకు ఓయు డాక్టరేట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు సహాచార్యులుగా పనిచేస్తున్న నారాయణపేట జిల్లాలోని కోటకొండ గ్రామానికి చెందిన కోటకొండ రాఘవేంద్రరావుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయు) తెలుగు ఓరియంటల్ విభాగం నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ కె జోత్స్నప్రభ పర్యవేక్షణలో 'పశ్చిమ తెలంగాణ సాహిత్యం-భాష, కన్నడ ప్రభావం'అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. దాన్ని పరిశీలించిన అనంతరం ఓయూ డాక్టరేట్‌ను ప్రదానం చేయాలని తెలుగు విభాగం నిర్ణయించింది. బుధవారం హైదరాబాద్‌లోని ఓయూలో కె జోత్స్నప్రభ, సి కాశీం కలిసి రాఘవేంద్రరావుకు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్ అలివేలు మంగమ్మ, అధ్యాపక బృందం ఆయన్ను అభినందించారు.

ఉగాది రోజు టెన్త్ మూల్యాంకన కేంద్రాలకు సెలవు ఇవ్వండి

- బుర్రా వెంకటేశానికి తపస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉగాది పండుగ రోజు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రాలకు సెలవు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతరావు, నవాత్ సురేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌ను కలిసి 60 ఏండ్లు దాటిన ఉపాధ్యాయులకు పార్లమెంటు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి విధులు కేటాయించొద్దని సూచించారు. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రాల్లో ఎండలు తీవ్ర స్థాయిలో ఉండడంతో వసతులను మెరుగుపర్చాలంటూ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. గతేడాది టిఎ, డిఎల బిల్లులను చెల్లించాలని కోరారు.

దళితులకు మత స్వేచ్ఛ ఏది?

- దళిత క్రైస్తవుల ఎస్‌సి రిజర్వేషన్ సాధన సమితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



దళితులు తమకు ఇష్టమైన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను కల్పించాలని దళిత క్రైస్తవుల ఎస్‌సి రిజర్వేషన్ సాధన సమితి డిమాండ్ చేసింది. బుధవారం సాధన సమితి ఆధ్వర్యంలో క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనాన్ని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాగళ్ల పోచయ్య మాట్లాడుతూ.. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు ఏ మతాన్ని అనుసరిస్తున్నా... వారి రిజర్వేషన్లను అనుభవిస్తున్నారని తెలిపారు. ఎస్‌సిల విషయంలో మాత్రం అందుకు భిన్నంగా క్రైస్తవులైతే ఎస్‌సి రిజర్వేషన్లను తొలగిస్తూ వివక్ష చూపించడం తగదని హితవుపలికారు. దళితులకు మత స్వేచ్ఛను కల్పించే వారికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగల్ల కృష్ణ, రాష్ట్ర నాయకులు మారపాక ప్రభాకర్, పల్లె భూమమ్మ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు భాస్కర్, ఉపాధ్యక్షులు జి.ప్రకాశ్, స్వామిదాస్, ఎ.జైపాల్ పాల్గొన్నారు.

లుక్‌అవుట్ నోటీసు చెల్లదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసులు జారీ చేసిన లుక్‌అవుట్ నోటీసుల (ఎల్ఓసి)ను రద్దు చేయాలంటూ బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ వద్ద గత డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలీసులు జారీ చేసిన ఎల్ఓసీని సవాల్ చేశారు. రాత్రి వేళ ఫ్లై ఓవర్ వద్ద ఉన్న బ్యారికేడ్లను ఢీకొట్టిన కేసులో సాహిల్ కోసం పోలీసులు లుక్ఔట్ నోటీసులు జారీ చేశారు. దానిని సవాల్ చేస్తూ సాహిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కావాలని ప్రమాదం చేయలేదనీ, హెచ్చరిక బోర్డులు పెట్టక పోవడంతో చీకటి వల్ల ప్రమాదం జరిగిందని వివరించారు. ఈ కేసులో ఎల్వోసీ జారీ చేయడం అన్యాయమన్నారు. పంజాగుట్ట పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేయడం చెల్లదన్నారు. తన తండ్రికి వైద్యం వెళితే పోలీసులు లుక్ఔట్ నోటీసు ఇచ్చారన్నరు. ఈ వ్యాజ్యం హైకోర్టు విచారణకు రానుంది.

బండికి వెసులుబాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను అరెస్ట్ చేయొద్దని పోలీసులకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సంజయ్ సహా ఇతర పిటిషనర్లకు సీఆర్‌సీపీ ప్రకారం 41ఎ నోటీసులు జారీ చేశాకే వారిపై ఉన్న కేసులను విచారణ చేయాలని ఆదేశించింది. హెూళీ సందర్భంగా జరిగిన ఘర్షణ నేపథ్యంలో చెంగిచర్ల వెళితే తనపై రాజకీయ ప్రేరేపితంగా తప్పుడు కేసు పెట్టారని, ఉప్పల్, మేడిపల్లిలో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని సంజయ్‌తోసహా ఆరుగురు పిటిషన్లు వేశారు. వీటిని జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. వాదనల తర్వాత హైకోర్టు.... సంజయ్, ఇతర పిటిషనర్లను అరెస్టు చేయవద్దని ఆదేశిస్తూ, విచారణను జూన్ 11కు వాయిదా వేసింది.

తెలుగు ఛాప్టర్ 'బిఎన్ఐ అక్షర' ప్రారంభం

హైదరాబాద్ : తెలుగు బాషలో వ్యాపార లావాదేవీలు జరుపుకునేందుకు వీలుగా బిఎన్ఐ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలుగు ఛాప్టర్ 'బిఎన్ఐ అక్షర'ను ప్రారంభించారు. ప్రపంచంలోని మొట్టమొదటి తెలుగు ఛాప్టర్ అని బిఎన్ఐ హైదరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా తెలిపారు. ఈ సమావేశంలో 46 మంది సభ్యులు తమ వ్యాపారాలు, సేవలను పరిచయం చేసుకున్నారు. 80 మంది వ్యాపార రిఫరల్‌లను పరస్పరం మార్చుకున్నారు. సంజనా షా కోడ్ ఆఫ్ ఎథిక్స్‌పై ప్రమాణం చేయించారు. వివిధ రంగాలకు చెందిన 128 మంది వ్యాపారవేత్తలు ఈ సమావేశానికి సందర్శకులుగా హాజరయ్యారు

హైదరాబాద్ మార్కెట్లోకి

- బయోక్లబ్ సోడాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బయో బెవరేజెస్ ఉత్పత్తుల కంపెనీ బయో ఇండియా అధికారికంగా హైదరాబాద్ మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బయో బెవరేజెస్ ఆవిష్కర్త శ్రీనివాస్ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ఆర్అండ్‌డి, తయారీ కోసం రూ.80 కోట్ల వ్యయం చేశామన్నారు. తమ ఉత్పత్తులు సింథటిక్ రుచులు, రంగులు లేని సహజ సుగంధాలతో ఉంటాయన్నారు. సంప్రదాయ ఉత్పత్తులతో పోలిస్తే అదే శాతంలో ఆల్కహాల్ ప్రభావాలను అందిస్తాయని తెలిపారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

- సిఎంకు టిపిడిఎంఎ అధ్యక్షులు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాల సంఘం (టిపిడిఎంఎ) అధ్యక్షులు డాక్టర్ బి సూర్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో ఆయన కలిశారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ప్రయివేటు జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజీల్లో 14 మంది విద్యార్థులు చదువుతున్నారనీ, వారికి చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏడాదికి సుమారు రూ.700 కోట్లు అవుతుందని వివరించారు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 31లోపు పాత విద్యార్థులకు (రెన్యూవల్స్), మార్చి 31లోపు కొత్త విద్యార్థుల (ఫ్రెష్)కు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. వృత్తి విద్యా కాలేజీలు యాజమాన్య కోటా, ఇతర ఫీజులను విద్యార్థుల నుంచి వసూలు చేస్తాయని తెలిపారు. కానీ డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాలకు ఎలాంటి ఫీజులను వసూలు చేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఫీజు బకాయిలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న టోకెన్ల డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు.



ఎసిబికి చిక్కిన టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిల్డింగ్‌కు పర్మిషన్ ఇవ్వడానికి రూ.50 వేల లంచం తీసుకుంటూ డిటిసిపి డిప్యూటీ డైరెక్టర్ జగన్మోహన్ ఎసిబి చేతికి చిక్కారు. ఎసిబి డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ చింతలకుంట చెక్‌పోస్ట్ నివాసి అయిన జితేందర్‌రెడ్డి కొత్తగా నిర్మించదలచుకున్న భవనానికి అనుమతి కోసం డిటిసిపిలో డిప్యూటీ డైరెక్టర్ పనిచేస్తున్న జగన్మోహన్‌ను కలిశారు. అందుకు అతను రూ 50 వేలు డిమాండ్ చేశారు. దాంతో జితేందర్‌రెడ్డి ఎసిబిని ఆశ్రయించాడు. అధికారి జగన్మోహన్‌కు బుధవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని అతని కార్యాలయంలో బాధితుడు రూ.50 వేలు ఇస్తుండగా.. అక్కడే మాటు వేసిన ఎసిబి అధికారులు పట్టుకున్నారు. నిందితుడిని ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరు పరుస్తామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు.

విద్య కార్పొరేటీకరణతో ప్రమాదం

- ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్య వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, హిందూత్వీకరణను వెంటనే ఆపేయాలని అఖిల భారత విద్యాహక్కుల వేదిక అధ్యక్షవర్గం సభ్యులు, ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం అఖిలభారత విద్యాహక్కు వేదిక, తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "అన్ని రాజకీయ పార్టీలు–విద్యపై తమ వైఖరి తెలపాలని" రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల గురించి, అలాగే సమాజంలో అందరికీ సమానమైన విద్య ఎందుకు అందడం లేదో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ పార్టీలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. విద్య పట్ల అన్ని రాజకీయ పార్టీల వారి వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను ఎందుకు ధ్వంసం చేస్తున్నారో, యూనివర్సిటీలను ఎందుకు సంక్షోభంలోకి నెట్టేస్తున్నారో పాలకులను నిలదీయాలని కోరారు. ప్రయివేటు విద్యను ప్రోత్సహిస్తూ విద్యను కాషాయీకరణం చేస్తున్నారని, ప్రశ్నించే తత్వాన్ని అణచివేస్తున్నారని, ప్రజలను బానిసత్వంలోకి నెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలు భారతదేశంలో కీలకమైనవన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల, ప్రజా సంఘాల నాయకులు ప్రజల వద్దకు వెళ్లి వారిని చైతన్యవంతం చేసి విద్య ప్రాధాన్యతను తెలపడానికి కృషి చేయాలన్నారు. విద్యా రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శాస్త్రీయ విద్య, సమాన విద్య, ఉచిత విద్య కోసం పోరాడాలని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల ధ్వంసం, ఉపాధ్యాయుల నియామకాలపై నాయకులను నిలదీయాలని అన్నారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో సమాజం పూర్తిగా అంధకారంలో కూరుకుపోతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కృష్ణప్ప, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య, టిపిటిఎఫ్ రాష్ట్ర కమిటీ మెంబర్ ప్రకాష్‌రావు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్, పిడిఎస్‌యూ విజృంభన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్, పిడిఎస్‌యు నగర అధ్యక్షుడు గడ్డం శ్యామ్, సిటీ సెక్రటరీ శ్రీను, సిటీ జాయింట్ సెక్రెటరీ గౌతమ్ పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కూతురు కోసం 'కడియం' దిగజారుడు రాజకీయాలు

- పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతాం : మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాదిగ నాయకుల రాజకీయ భవిష్యత్తును అణగదొక్కి ఇప్పుడు తను బిడ్డ కావ్య కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తున్న కడియం శ్రీహరికి వరంగల్ జిల్లా మాదిగలు తగిన బుద్ధి చెప్పాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ ప్రెస్ క్లబ్‌లో మంద కృష్ణ మాదిగ మాట్లాడారు. మంగళవారం తనపై కడియం శ్రీహరి అనేక అసత్య ఆరోపణలు చేశారని, మాదిగల వర్గీకరణకు, మాదిగ దండోరా ఉద్యమానికి తాను మద్దతు ప్రకటిస్తేనే మందకృష్ణ ఈ స్థాయికి వచ్చారని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రధానంగా తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్, ఆరూరి రమేష్‌ల రాజకీయ భవిష్యత్తును నాశనం చేసారని తెలిపారు. శ్రీహరి మంత్రిగా ఉన్న సమయంలో అనేకమంది దళిత నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేయడంలో ప్రధాన పాత్ర పోషించి, ఇప్పుడు వేదాలు వల్లిస్తున్నాడన్నారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు మంద కుమార్‌మాదిగ, వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, ఎంఆర్‌పిఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఒక్క రోజులో ఆన్‌లైన్‌లో 709 కార్ల బుకింగ్స్

- స్కోడ ఇండియా వెల్లడి

హైదరాబాద్ : భారత్‌లో 24 సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా తొలిసారిగా నిర్వహించిన 24 గంటల ఆన్‌లైన్ సేల్స్ ప్రోగ్రామ్‌లో 709 కార్ల బుకింగ్‌లను సాధించినట్లు స్కోడా ఆటో ఇండియా తెలిపింది. దేశంలో డిజిటలైజేషన్ వ్యూహాన్ని మరింతగా విస్తరించనున్నట్లు పేర్కొంది. 'నేమ్ యువర్ స్కోడా' క్యాంపెయిన్‌లో భాగంగా డిజిటల్ క్యాంపెయిన్‌తో రాబోయే కాంపాక్ట్ ఎస్‌యువి కోసం ఇప్పటి వరకు 1.50 లక్షల పేరు సూచనలను పొందినట్లు తెలిపింది. తమ అన్ని షోరూంలను డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించింది.

కాంగ్రెస్ అంటేనే లీకులు, ఫేక్ న్యూస్‌లు

- ఈ ఎన్నికల్లో ఆ పార్టీని బొంద పెట్టాలి
- బిఆర్‌ఎస్‌ను వీడినవారికి మూడో స్థానమే : మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అంటేనే లీకులు.. ఫేక్ న్యూస్‌లు.. పాలన గాలికొదిలేసి అక్రమ కేసులతో కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన బిఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండమని సిఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, కానీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ బయటికి రాగానే రాష్ట్రంలో కాల్వల్లో నీళ్లు పారుతున్నాయని తెలిపారు. ఎన్నికల కోడ్ సాకుతో హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మాట తప్పిందన్నారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. కార్యకర్తలు కాంగ్రెస్ మోసాలను గ్రామాల్లో విడమర్చి చెప్పాలన్నారు. కొంత మంది స్వార్థపరులు పార్టీని వీడి పోతున్నారని, వాళ్లను ప్రజలు నమ్మడం లేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తేనే ఆరు గ్యారంటీల పథకాలు అమలవుతాయని అన్నారు. నలభై రోజులు కష్టపడితే భువనగిరిలో గెలుస్తామన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిందన్నారు. బిఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ టికెట్ పై పోటీ చేస్తున్న దానం నాగేందర్, కడియం కావ్య, రంజిత్ రెడ్డి, పట్నం సునీత మూడో స్థానంలో ఉంటారని జోస్యం చెప్పారు. స్వార్థపరులే పార్టీలు మారుతున్నారని, వారిని ఓడించాలని కార్యకర్తలు కసితో ఉన్నారని అన్నారు. ప్రజల మాస్ లీడర్, బలహీన వర్గాల నాయకుడు క్యామ మల్లేష్ భువనగిరిలో తప్పకుండా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఈ భూమి ఉన్నంత కాలం బిఆర్‌ఎస్ ఉంటుందని, కార్యకర్తలు అంతా ఉద్యమ స్ఫూర్తితో పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో భువనగిరి బిఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జడ్‌పి చైర్మన్ సందీప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, నాయకులు బడుగుల లింగయ్య యాదవ్, కర్నె ప్రభాకర్, పొన్నాల లక్ష్మయ్య, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు



కొనసాగుతున్న నంది జాతీయ నాటకోత్సవాలు

- నేడు ముగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మినీ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న పద్య పౌరాణిక సాంఘిక నంది జాతీయ నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం నాల్గో రోజు కార్యక్రమాన్ని అష్టావధాని, రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయులు కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి, రంగస్థలం సీనియర్ నటులు గుంటి పిచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు జానకిరామ్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా కమిటీ కార్యదర్శి పులి కృష్ణమూర్తిశర్మ మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలకు లోనై నంది నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నాటకోత్సవాలకు సహకరించిన దాతలు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. గురువారం నాటిక పోటీలకు చివరి రోజు అని, ఉదయం టి కృష్ణ ఆర్ట్స్ థియేటర్ మిట్టపాలెం పల్నాడు జిల్లా వారిచే 'ప్రేమించే వయసేనా?' సాంఘిక నాటిక, ఉదయం 11 గంటలకు 'జరుగుతున్న కథ' అరవింద తాడేపల్లి, గుంటూరు జిల్లా వారిచే సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ నాటికల అనంతరం బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. బుధవారం టిబిఆర్స్ థియేటర్స్ హైదరాబాద్ వారికి 'శ్రీస్వామి అయ్యప్ప' పద్య నాటిక, నటరాజసమితి అసోసియేషన్ పెందుర్తి వారిచే 'శిథిల జీవితం' సాంఘిక నాటిక, డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీ సాయిబాబా నాట్యమండలి విజయవాడ వారిచే మాధవ వర్మ పద్య నాటిక నిర్వహించారు. అనంతరం కళాకారులకు ప్రశంసా పత్రాలతోపాటు నగదు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు తడకమళ్ళ రామచంద్రరావు, అధ్యక్ష కార్యదర్శులు భుజంగరావు పులి కృష్ణమూర్తి శర్మ, గ్యార సాయిలు, కోశాధికారి పుల్లాభట్ల లక్ష్మీనారాయణ శర్మ, చంద్రశేఖర్ రావు జానకిరామ శర్మ, ఎండి ఇనాయతుల్లా, పాల్గొన్నారు.

అమెజ్ ప్రచారకర్తగా కోహ్లీ




లక్నో : లూమినస్ పవర్ టెక్నాలజీకి చెందిన సోలార్ ఉత్పత్తుల బ్రాండ్ అమెజ్ ప్రచారకర్తగా విరాట్ కోహ్లీని నియమించుకుంది. తమ సౌర ఆధారిత ఉత్పత్తులతో సహా ఎనర్జీ సొల్యూషన్స్‌కు విస్తృత ప్రచారం కల్పించనున్నారని ఆ సంస్థ పేర్కొంది. వచ్చే మూడేళ్లలో మూడు రెట్ల వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ కంపెనీ సిఇఒ, ఎండి ప్రీతి బజాజ్ తెలిపారు.

సామ్‌సంగ్ నుంచి ఎఐ గృహోపకరణాలు



ముంబయి : సామ్‌సంగ్ ఇండియా కొత్తగా ఎఐ ఆధారిత బెస్పోక్ గృహోకరణాలను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఇవి ప్రీమియం ఉపకరణాల విభాగంలో వినియోగదారుల అంచనాలను చేరనున్నాయని ఆ సంస్థ పేర్కొంది. బుధవారం ముంబయిలో వీటినిసామ్‌సంగ్ సౌత్ వెస్ట్ ఏసియా సిఇఒ జెబి పార్క్ విడుదల చేశారు. వైఫై, అంతర్గత కెమెరాలు, అధునాతన ఎఐ చిప్‌లను అమర్చినట్లు జెబి పార్క్ పేర్కొన్నారు. వీటిలో వాషింగ్ మిషన్లు, రిఫ్రిజిరేటర్లు, ఎసిలు, ఓవెన్ తదితర ఉత్పత్తులున్నాయి. ఇందులోని ఎనర్జీ మోడ్‌తో రిఫ్రిజిరేటర్లు 10 శాతం, ఎసిలు 20 శాతం, వాసింగ్ మిషన్లు 70 శాతం వరకు ఇంధనాన్ని ఆదా చేస్తాయన్నారు.

లుబ్రిజోల్ ఇండియా సిఎండిగా నితిన్ మెంగిని



న్యూఢిల్లీ : బెర్క్‌షైర్ హాత్‌వేకి చెందిన లూబ్రిజోల్ అడిటివ్స్ ఐఎంఇఎ వైస్ ప్రెసిడెంట్‌గా నితిన్ మెంగిని నియమించినట్లు ఆ సంస్థ తెలిపింది. అదే విధంగా లూబ్రిజోల్ ఇండియా సిఎండిగా కూడా ఆయన బాధ్యతలను స్వీకరించనున్నారని పేర్కొంది. ఆసియా పసిఫిక్, ఇండియా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికాతో సహా పలు ప్రాంతాల్లో గ్యాస్, ఆయిల్స్ పరిశ్రమలోని బృందాలకు 20 ఏళ్ల పైగా నేతృత్వం వహించిన అనుభవం ఆయనకు ఉందని ఆ సంస్థ తెలిపింది.

నెలవారి చెల్లింపులతోనూ వైద్య బీమా

- స్టార్ హెల్త్‌తో ఫోన్‌పే జట్టు

న్యూఢిల్లీ : నెలవారి చెల్లింపు ఆప్షన్లతోనూ వైద్య బీమాను పొందవచ్చని ఫోన్‌పే తెలిపింది. ఇందుకోసం తాము స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. యుపిఐ ఆటోపే ద్వారా తమ వినియోగదారులకు నెలవారీ, వార్షిక చెల్లింపు పద్దతిలో రూ.1 కోటి వరకు బీమా అందించడానికి ఈ ఒప్పందం చేసుకున్నామని ఫోన్‌పే ఇన్సూరెన్స్ సిఇఒ విశాల్ గుప్తా తెలిపారు.

ఆడి లగ్జరీ కార్ల విక్రయాల్లో 33శాతం వృద్ధి

ముంబయి : దేశంలో లగ్జరీ కార్లకు డిమాండ్ పెరిగిపోయింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023–24)లో 33 శాతం వృద్ధితో 7,027 యూనిట్ల లగ్జరీ కార్లను విక్రయించినట్లు ఆడి ఇండియా తెలిపింది. క్రితం ఒక్క మార్చి త్రైమాసికంలోనే ఏకంగా 1,046 యూనిట్ల అమ్మకాలు చేసినట్లు వెల్లడించింది. ఈ ఏడాదిలో భారత్‌లో మొత్తంగా 50,000 లగ్జరీ కార్ల అమ్మకాలు జరగొచ్చని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ దిల్లన్ అంచనా వేశారు.

మాజీ ఎమ్మెల్యేకు కేటాయించిన ఇళ్లు సీజ్

- స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌కు సాగర్‌లో కేటాయించిన ఇంటిని అధికారులు సీజ్ చేశారు. నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలోని బిఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నివాసమున్న ఇఇ 19 నెంబర్ గల ఇంటిని మంగళవారం సాయంత్రం నాగార్జున సాగర్ ప్రాజెక్టు అధికారులు రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లోని వస్తువులను ఎన్‌ఎస్పీ స్టోర్ రూమ్‌కు తరలించారు. ఈ విషయంలో సాగర్ డ్యామ్ ఇఇ మల్లికార్జునరావును వివరణ కోరగా ఆ ఇంటిని గతంలో మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య క్యాంప్ ఆఫీస్ పేరు మీద అలాట్‌మెంట్ చేసినట్టు చెప్పారు. దానిపై ప్రభుత్వ నిధులతో మరమ్మతులు కూడా చేయించారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నికైనందున ఆ నివాసాన్ని వారికి అప్పగించాల్సి ఉన్నార్రు. ఈ విషయంలో పలుమార్లు నోటీసులు అందజేసినా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నుంచి స్పందన రాలేదన్నారు. దీంతో కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం మంగళవారం రాత్రి సామగ్రిని తరలించి, ఇంటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్‌ను వివరణ కోరగా, సాగర్‌లో తాను నివాసముంటున్న ఇంటిని తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా ఎన్‌ఎస్‌పి అధికారులు స్వాధీనం చేసుకోవడం అన్యాయమన్నారు. ఈ విషయంలో న్యాయపరంగా పోరాటం సాగిస్తామన్నారు.



నిరసన చేస్తున్న బిఆర్‌ఎస్ శ్రేణులు

బిఆర్‌ఎస్ శ్రేణుల నిరసన

మాజీ ఎమ్మెల్యే ఇంటిని అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలుసుకొని బిఆర్‌ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బిఆర్‌ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని, ఇలాంటి చర్యలు మానుకోవాలని అన్నారు.



మార్కెట్లోకి టయోటా అర్బన్ క్రూయిజర్ టేసర్

బెంగళూరు : ప్రీమియం కార్ల తయారీ కంపెనీ టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) బుధవారం భారత మార్కెట్లోకి తన కొత్త అర్బన్ క్రూయిజర్ టేసర్‌ను విడుదల చేసింది. టేసర్ ప్రారంభ ధర రూ.7.73 లక్షలుగా, హైఎండ్ మోడల్ ధరను రూ.13.03 లక్షలుగా నిర్ణయించింది. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో రెండు వేరియంట్లలో దీన్ని అందుబాటులోకి తెచ్చింది. సిఎన్‌జి వర్షన్‌లోనూ లభిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తమకు భారత మార్కెట్ చాలా ముఖ్యమైందని టికెఎం డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ తదాషి అసజుమా పేర్కొన్నారు. బుకింగ్స్ తెరిచామని.. మే నుంచి డెలివరీ చేయనున్నామన్నారు. దిగ్గజ వాహన కంపెనీలు మారుతీ, టయోటా భాగస్వామ్యంలో 6వ మోడల్ కావడం విశేషం.

తాగు, సాగు నీరే ఆయుధాలు

- లోక్‌సభ ఎన్నికలకు బిఆర్‌ఎస్ అస్త్రాలివే
- కరెంటు కష్టాలు కలిసొస్తాయనే విశ్వాసం
- జిల్లాల వారీగా పర్యటించనున్న కెసిఆర్
- ఐదున కరీంనగర్‌లో పంటల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షాభావ పరిస్థితులు, మండుతున్న ఎండలు, ఫలితంగా తలెత్తిన తాగు, సాగునీటి ఎద్దడులు... ఇవన్నీ అధికార కాంగ్రెస్‌కు కొంత ఇబ్బందికర పరిస్థితులుగా మారితే, వాటినే తన అస్త్రాలుగా మలుచుకోవాలని ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్ భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మంచినీటి ఇక్కట్లు మొదలయ్యాయనీ, నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ అంచనా వేశారు. ఆ మేరకు ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ఆ సందర్భంగా ప్రజలు, ముఖ్యంగా రైతుల నుంచి మంచి స్పందన వచ్చిందని గులాబీ పార్టీ చెబుతోంది. ఈ స్పందనను మరింత సానుకూలంగా మార్చుకోవటం ద్వారా త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు ఒక బలమైన ఆయుధంగా మార్చుకోవాలని ఆ పార్టీ భావిస్తోంది. వీటితోపాటు కరెంటు కష్టాలను తనకు అనుకూలంగా మలచుకోవాలని బిఆర్‌ఎస్ నిర్ణయించింది. కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారెంటీలు, వాటి అమలు, వాటికి నిధులు తదితరాంశాలపై ఇప్పటికిప్పుడే ప్రజల్లో వ్యతిరేకత రాదని కేసీఆర్ అంచనా వేశారు. అందువల్ల వాటి జోలికెళ్లకుండా ప్రత్యక్షంగా జనం అనుభవించే, వారు నేరుగా ఇబ్బందిపడే తాగు, సాగు నీరు, కరెంటు సమస్యలను అజెండాగా ఎంచుకుని ముందుకు పోవాలని ఆయన నిర్ణయించారు. వీటిపైన్నే ప్రధానంగా దృష్టి సారించి, సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలంటూ పార్టీ నేతలను ఆదేశించారు. ప్రధానంగా పదేండ్ల తమ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించిన వైనాన్ని, సాగునీరు పుష్కలంగా వదిలిన తీరును, ఫలితంగా భూగర్భ జలాలు పెరిగిన వైనాన్ని లెక్కలు, గణాంకాలతో సహా ప్రతీ మీటింగులోనూ వివరించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. దీంతోపాటు రైతు బంధు నిధులు ఆలస్యంగా పడటం, రైతు భరోసా పథకంపై రేవంత్ సర్కార్ ఇప్పటికీ స్పష్టత ఇవ్వక పోవటం అనే అంశాలను ప్రధాన ఇతివృత్తాలుగా ఎంచుకోవాలని, ఈ విషయాలపై క్యాడర్‌కు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. వీటిని ఎంపి ఎలక్షన్లలో సాధ్యమైనంత ఎక్కువగా వాడుకోవాలని కెసిఆర్ ఆదేశించారు. ఆదివారం పర్యటన ద్వారా ఈ అంశాలన్నింటిపై ఒక స్పష్టతకు వచ్చినట్టు ఆయన వారికి వివరించినట్టు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించిన కెసిఆర్... తన తదుపరి పర్యటనకు బిఆర్‌ఎస్‌కు మంచి పట్టున్న కరీంనగర్ లోక్‌సభ స్థానాన్ని ఎంచుకున్నారు. ఆ ఎంపీ స్థానం పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల అసెంబ్లీ స్థానాలను కారు పార్టీ గెలుచుకుంది. అందువల్ల కొద్దిగా కష్టపడితే ఆ లోక్‌సభ స్థానాన్ని సులభంగా కైవసం చేసుకోవచ్చని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకే ఈ నెల ఐదున తన తర్వాతి పర్యటనను ఆ జిల్లాలో కొనసాగించనున్నారు. ఒకవైపు బిఆర్‌ఎస్‌ను వీడుతున్న నేతల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండగా, ఆ నైరాశ్యం నుంచి కార్యకర్తలు, నాయకులను బయటపడేసేందుకు, వారిలో ధైర్యం నింపేందుకు గులాబీ బాస్ ఇలాంటి వ్యూహాలను ఎంచుకున్నారని కొందరు కీలక నేతలు వ్యాఖ్యానించారు.

పార్టీ మారిన నాయకులను శిక్షించాల్సిందే..

- రైతుల ఆదాయం పెంచని బిజెపికి ఎందుకు ఓటెయ్యాలి?
- కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీ మారిన నాయకులను శిక్షించాల్సిన బాధ్యత కార్యకర్తలే తీసుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. వికారాబాద్ జిల్లా చేవెళ్లలో నిర్వహించిన చేవెళ్ల పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ చేవెళ్ల ఎంపి అభ్యర్థి రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి బిఆర్‌ఎస్ పార్టీకి ద్రోహం చేశారని విమర్శించారు. మంత్రి కావాలని రాజకీయల్లోకి వచ్చినప్పటి నుంచి కలలు కన్నారని, ఆ కలను మాజీ సిఎం కెసిఆర్ నెరవేర్చి.. ఒకసారి కాదు రెండుసార్లు మంత్రిగా అవకాశం కల్పించారని తెలిపారు. చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని కెసిఆర్ ఎంపిగా గెలిపించారని, అయినా వారు పార్టీకి ద్రోహం చేసి మరో పార్టీలోకి వెళ్లాలని, ఆ ఇద్దరిని శిక్షించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా పోటీ పడేందుకు ముందుకు వచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో జరిగిన వైఫల్యాలు, ప్రభుత్వ మోసాలను, కరువు తదితర విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతులను ఆదుకునేందుకు రైతు భరోసా, రుణమాఫీ, వరికి బోనస్ వంటి చర్యలు వెంటనే చేపట్టాలని, పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక్క మెడికల్ కాలేజీ, నవోదయ పాఠశాల ఇవ్వని, రైతుల ఆదాయం డబుల్ చేస్తానని చెప్పి మోసం చేసిన బిజెపికి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. మల్కాజ్‌గిరిలో పోటీకి రమ్మంటే ఇప్పటికీ రేవంత్‌రెడ్డి నుంచి స్పందన లేదని, ఓడిపోతామని రేవంత్‌కు తెలుసని, అందుకే మల్కాజ్‌గిరి, చేవెళ్లలో డమ్మీ అభ్యర్థులను పోటీలో పెట్టారని విమర్శించారు. చేవెళ్లలో బీఆర్‌ఎస్, బిజెపి పార్టీల మధ్యనే పోటీ అని తెలిపారు. మహిళలకు ఇస్తానన్న రూ.2,500 ఇవ్వాలని, రుణమాఫీ చెయ్యాలని, అవ్వ, తాతాలకు రూ. 4 వేలు ఇవ్వాలని, పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హొదా తీసుకురావాలని రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్